మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# మన్యంకొండను అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం..!

**సంవత్సరంలోపు శ్రీ వేంకటేశ్వర హరిత హోటల్, శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపాన్ని పూర్తి చేస్తాం**

**బడ్జెట్ హోటల్, కళ్యాణ మండపం శంకుస్థాపన సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్‌రూరల్ మండలంలో నెలకొన్న మన్యంకొండ దివ్యక్షేత్రాన్ని అద్భుతమైన క్షేత్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం మన్యంకొండవద్ద 15కోట్ల రూపాయల వ్యయం తో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర హరిత హోటల్, శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాక పూర్వం మన్యంకొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇక్కడికి వచ్చిన భక్తులకు కనీసం స్నానం చేసేందుకు, తాగడానికి సైతం మంచినీరుండేది కాదని, కోనేటిలో స్నానాలు ఆచరించిన వారందరికి జబ్బు చేసేదని, కృష్ణానదిలో మునులు స్నానమాచరిస్తుండగా శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహం దొరికిందని, అలాంటి విగ్రహాన్ని ప్రతిరోజు కృష్ణాజలాలతో పునీతం చేయాలన్న సంకల్పంతో కృష్ణానది నీటిని మిషన్ భగీరథ ద్వారా కొండపైకి తీసుకువచ్చి ప్రతిరోజు అభిషేకం చేస్తున్నామని తెలిపారు. ఇక్కడికి వచ్చే భక్తుల కోసం కళ్యాణ మండపాన్ని నిర్మించామని అదేవిధంగా కొండపైన 18 రూములతో ఏసి వసతి సదుపాయం కల్పించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి రోప్‌వేను ఇక్కడ నిర్మించనున్నామని, సంవత్సరంలోపు ఇది పూర్తవుతుందని తెలిపారు. అంతేకాక కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి మన్యకొండకు వచ్చే భక్తుల కోసం 15 కోట్ల రూపాయలు వెచ్చించి శ్రీ వెంకటేశ్వర హరిత హోటల్‌ను, అదేవిధంగా శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామని, సంవత్సరంలోపు ఈ పనులు పూర్తవుతాయని తెలిపారు. అలాగే వచ్చే సంవత్సరం నాటికి సామూహిక వివాహాలు జరిపించడమే కాకుండా ఎవరైనా వ్యక్తిగతంగా వివాహాలు జరుపుకునేందుకు అన్ని సౌకర్యాలతో కళ్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. మన్యంకొండ క్షేత్రంలో మంచి వాతావరణం కల్పించేలా ప్రతి ఒక్కరు పనులలో భాగస్వాములు కావాలని, ఇటీవలే మన్యంకొండపైకి డబుల్ రోడ్డుతో పాటు, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ మీడియన్ ఏర్పాటు చేశామని, ఎక్కడైనా సెంట్రల్ లైటింగ్ పాడైనట్లయితే తక్షణమే వేయించాలని అన్నారు. వెంకటేశ్వర పార్కుతో పాటు, ఆంజనేస్వామి విగ్రహాన్ని నిర్మిస్తున్నామని, అలాగే పక్కనే ఉన్న ఎన్నో ఏళ్ల నుండి నిరాదరణకు గురైన శ్రీ లక్ష్మి నరసింహస్వామి గుడిని పునరుద్దరించామని, ఇప్పుడు అక్కడ నిత్యపూజలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, మన్యంకొండ దేవాలయం ఛైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఎంపిపి సుధాశ్రీ, వైస్ ఎంపిపి అనిత, పిఎసిఎస్ డైరెక్టర్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటి ఉపాధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గణేష్, ఎంపిటిసి రవిందర్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అల్లావుద్దిన్, తహసిల్దార్ పాండు, ఎంపిడిఓ, టూరిజం డిఈ పరుషవేది, ఏఈ మధు, మన్యంకొండ దేవస్థానం కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హోటల్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి



ఫొటో గ్యాలరీని సందర్శిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరుస్తాం..

**వనపర్తి విద్యా విభాగం, జూన్20, ప్రభాతవార్త:** మన ఊరు మన బడి మన బస్తి మన బడి కార్యక్రమంలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీపీలు కేడీఆర్ నగర్, వనపర్తి పాఠశాలలను ప్రారంభించడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణలోని అన్ని పాఠశాలలను రాబోయే రోజుల్లో అమలుచేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల్లో కొత్తడిజిటల్ బోర్డులు, డబుల్ డెస్క్ బెంచీలు, కార్పోరేట్ పాఠశాలల కంటే ఖరీదైన వస్తువులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జడ్పీ ఛైర్మన్ లోక్‌నా థ్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, వైస్ ఛైర్మన్ శ్రీధర్, కౌన్సిలర్ నాగన్న, విద్యా కమిటీ ఛైర్మన్ పర్వతాలు, హెచ్ఎంటి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# మన ఊరు.. మన బడితో..
# ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు..!

- గత ప్రభుత్వాలు విద్యాశాఖను నిర్లక్ష్యం చేశాయి
- భావితరాల బాగు కోసమే విద్యాశాఖకు అత్యధికంగా నిధుల కేటాయింపు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు తెలుగు, ఉర్దూలో పాఠాలు బోధించిన మంత్రి నిరంజన్‌రెడ్డి



బండారు నగర్‌లో పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



మంత్రి నిరంజన్‌రెడ్డి , కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



బోర్డుపై రాసి అవగాహన కల్పిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూన్20, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలకు సకలసౌకర్యాలు కల్పించివి ద్యార్థులు, అధ్యాపకులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్యను అభ్యసించడానికి వీలుగా మన ఊరు మన బడి మన బస్తీ మన బడి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవ వేడుకలు నిర్వహించగా మంత్రి నిరంజన్‌రెడ్డి వనపర్తి జిల్లాలో పాల్గొన్నారు. జడ్పీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తో కలిసి వనపర్తి జిల్లాలో మన ఊరు మన బడి కింద మొదటి విడతలో మంజూరు అయి అన్ని పనులు పూర్తి చేసుకున్న పాఠశాలలను ప్రారంభోత్సవం చేశారు. పాఠశాలల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఉదయం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బండారు నగర్‌ను ప్రారంభోతనసవం చేశారు. రూ.14.32 లక్షల వ్యయంతో ఇంగ్లీష్ మీడియం, రూ.4.92 లక్షల వ్యయంతో ఉర్దూ మీడియం పాఠశాలలకు మరుగుదొడ్లు, ప్రహారీ గోడ, విద్యుత్, గ్రీన్ బోర్డు, డ్యుయల్ డెస్క్, తాగునీరు వంటి అన్ని మౌలిక వసతులు మన ఊరు మన బడి కార్యక్రమం కింద కల్పించడం జరిగింది. పాఠశాలల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. మంత్రి ఉర్దూలో సైతం గ్రీన్ బోర్డుపై రాసి ఉర్దూ మీడియం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలు ప్రతి రోజు స్నానం చేసుకోవాలని రోజు తప్పించి రోజు తలస్నానం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు పనుల్లో సహాయం చేయాలని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమం చేపట్టి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. ఇంతకుముందు ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఒక నూతన ఒరవడి ప్రారంభమైందని అన్నారు. విద్యపై పెడుతున్న పెట్టుబడి భావితరానికి నిజమైన పెట్టుబడి అని అభివర్ణించారు. అనంతరం రూ.10.43 లక్షల వ్యయంతో పునరుద్ధరణ చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కేడీఆర్ నగర్ పాఠశాలను ప్రారంభోత్సవం చేశారు. అచ్యుతాపురంలో రూ.12.04 లక్షల నిధులతో మన ఊరు మన బడి కింద పునరుద్ధరణ చేసిన పాఠశాలలను ప్రారంభోత్సవం చేశారు. గోపాల్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే 27 మంది విద్యార్థినిలకు సింగిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా సైకిళ్ల పంపిణీ చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తమకు మంచి నీటి సమస్య ఉందని అదే విధంగా ప్రహారీ గోడ కావాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే తాగునీటి సమస్య తీర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రహారీ గోడ సైతం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కేశంపేట, రేవల్లి మండలంలో రూ.8.89 లక్షలతో పునరుద్దరణ చేసిన పాఠశాలను ప్రారంభోత్సవం చేశారు. రేవల్లి గ్రామ పంచాయతీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను రూ.29.57 లక్షలతో మన ఊరు మన బడి కింద మౌలిక సదుపాయాలు కల్పించగా మంత్రి ప్రారంభోత్సవం చేశారు. నాగపూర్ గ్రామం మండల పరిషత్ పాఠశాలను రూ.25.97 లక్షలతో ఆధునీకరించగా ప్రారంభోత్సవం చేశారు. పక్కనే రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్వాడీ భవనాన్ని, సహకార సంఘం ద్వారా నిర్మించిన వ్యాపార సముదాయాన్ని మంత్రి ప్రారంభోత్సవం చేశారు. జడ్పీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, డీఈవో గోవిందరాజులు, పీఏసీఎస్ ఛైర్మన్ లోడే రఘు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల విద్యాధికారి, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు మంత్రి వెంట ఉన్నారు.

## మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి..

**నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**కోయిల్‌కొండ, జూన్ 20 ప్రభాతవార్త :** 2023,24 సంవత్సరానికి గాను హరితహారం 9వ విడతలో 15 లక్షల మొక్కలను నాటేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం జిల్లాకలెక్టర్ కార్యాలయంలో 2023,24 అవన్ని ప్లాంటేషన్ హరితహారం కార్యక్రమంలో భాగంగా అధికారులతో మాట్లాడుతూ నారాయణపేట మక్తల్ మార్గంలో అవెన్యూప్లాంటేషన్ నిర్వహించాలన్నారు. జక్లేర్, నర్వ నర్సరీలలో ఉన్న వేపచెట్లు, గుల్మోహారం, అల్లనేరేడు చెట్లు నాటాలన్నారు. రెన్‌ట్రీ వేప వారంలోపు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే టెక్ ఉమాచెట్లు పెట్టాలన్నారు. రెండు, మూడు రోజులలో గుంతలు త్రవ్వడం పూర్తి చేయాలని సింగారం గేటు నుండి లేబర్‌ను ఎక్కువగా తీసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. కోస్గిలో ఇంటికి 10 మొక్కలు చొప్పు పంపిణీ చేయాలని ఆదేశించారు. మొత్తం నుండి 35కి.మీ. వరకు రెండు మీటర్ల దూరం చొప్పున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం వచ్చేలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుని మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కృష్ణా దగ్గర వేరువేరుగా మొక్కలు నాటే చర్యలు చేపట్టాలన్నారు. కూలీల చెల్లింపులు సత్వరం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జిల్లా అటవిశాఖ అధికారి వీణ వాణి, డిఓ గోపాల్, జడ్పీ సీఈఓ జ్యోతి, డిపిఓ మురళి, ఎంపిడిఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



పాల్గొన్న అధికారులు

## రాజకీయ కుట్రలను ఎదురొడ్డి నిలిచిన నేతకు ఘన సన్మానం...

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** సేవా పరమావాధిగా భావి స్తూ తాను సంపాదించిన ప్రతి రూపాయిలో ప్రజలకు సేవ చేస్తూ... రాజకీయ రంగంలోఉంటే మరింత సేవా చేసే భాగ్యం కలుగుతుందని భావించి సేవా ధృక్పథంతో రాజకీయం చేస్తున్న జన నేత, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొలేక కేంద్ర ప్రభుత్వం ఐటీ వల ఐటీ దాడులు నిర్వహించారు. ఐటీ దాడుల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై ఎలాంటి అక్రమ, అవినీతిలు లేకపోవడంతో ఐటీ అధికారులు చేసేదేమి లేక వెనుదిరిగారు. వారం రోజుల తర్వాత జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిని డీసీసీబీ డైరెక్టర్ జక్క రఘునందన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. అనంతరం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సేవా చేయడానికి మాత్రమే రాజకీయంలోకి వచ్చానని, ఆస్తులు కూడబెట్టుకోవడానికి కాదని, ఎవరెన్ని ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన తల్గొగ్గకుండా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

## జంక్షన్లను సందర్శించిన ఎస్పీ నరసింహ..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్20, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ నరసింహ పోలీస్ అధికారులు, సిబ్బందికి వివరించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని పిస్తా హౌజ్ జంక్షన్ నుంచి జడ్చర్ల హౌసింగ్ బోర్డు వరకు ఉన్న రోడ్డు ప్రమాద ప్రదేశాలను సందర్శించారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలను ఆరా తీశారు. జంక్షన్ల వద్ద స్పీడ్ కంట్రోలర్లను, భారీ కేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అవరమైతే కొన్నింటిని మూసివేయాలని సూచించా రు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రాములు, డీఎస్పీ మహేశ్, జడ్చర్ల టౌన్ ఇన్ స్పెక్టర్ రమేశ్‌బాబు, ఎస్సై లెనిన్, మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై వెంకటే శ్వర్లు, ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

# స్వరాష్ట్రంలో విద్యావ్యవస్థకు పెద్దపీట..!

**నియోజకవర్గంలో గతంలో 5 ఉంటే నేడు 12 జూనియర్ కళాశాలలు ఉన్నాయి**
**ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**
**జడ్చర్లలో అట్టహాసంగా విద్యా దినోత్సవం**
**అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం సీఎం కెసిఆర్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోని జడ్చర్ల మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యా దినోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కెసిఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయడంతో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులకు మరింత గౌరవం పెరిగిందన్నారు. 2014 ముందు నియోజకవర్గంలో ఐదు జూనియర్ కళాశాలలే ఉండేవని, ప్రస్తుతం 12 జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం 1,20,000 ఖర్చు చేస్తుందని, కార్పోరేట్ స్థాయి విద్యనందిస్తుండడంతో నేడు ఎంబిబిఎస్, నీట్, ఇంజనీరింగ్ విద్యలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. ఇన్ని మంచి పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కెసిఆర్‌కు తెలంగాణ ప్రభుత్వానికి అందరం రుణపడి ఉంటామని, పనిచేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. విద్యా దినోత్సవంలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని అద్భుతంగా ఏర్పాటు చేసినందుకు ఎంఈఓ మంజులాదేవి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ మంజులాదేవి, ఉపాధ్యాయులు



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ మంజులాదేవి, ఉపాధ్యాయులు

**కల్లేపల్లి పాఠశాలలో రూ. 17.56 లక్షలు చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం...**

రాజాపూర్ మండల కల్లేపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు మనబడి పథకంలో రూ. 17,65,254తో చేపట్టిన తరగతి గదుల మరమ్మతు, తాగునీటి సౌకర్యం, బాలికలకు టాయిలెట్స్, పాఠశాలలో విద్యుదీకరణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1001 గురుకులాలను స్థాపించి, కార్పోరేట్ స్థాయి వసతులతో, నాణ్యమైన పౌష్టికాహారంతో కెజి టు పిజి ఉచిత విద్య అందించే దిశగా సర్కార్ అడుగులు వేస్తుందన్నారు. విద్యుదాఘాతంతో మరణించిన చిన్నవెల్లి గ్రామానికి చెందిన యాదన్న, హనుమన్‌గండ్ల తండాకు చెందిన దీపావత్ గోపాల్ కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అందిన రూపాయలు ఐదు లక్షల భీమా సాయం చెక్కులను ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన కార్పోరేషన్ ఛైర్మన్ వాల్యానాయక్, జడ్పీ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య, డిసిఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి రవిందర్, సంగీత నాటక అకాడమి మాజీ ఛైర్మన్ బాద్మి శివకుమార్, జడ్పీ సీఈఓ జ్యోతి, మార్కెట్ కమిటి ఛైర్మన్ మన్నెం గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, సింగిల్ విండో ఛైర్మన్ సుదర్శన్‌గౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు జంగయ్య, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, బండ్ల జ్యోతి, సుంకసారి రమేష్, ఆలూరి శశికిరణ్, ముడా డైరెక్టర్లు శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్, ప్రీతం, నాయకులు నాగిరెడ్డి, పిట్టల మురళి, శంకర్‌నాయక్, హాఫీజ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## 13మంది ఎస్సైల బదిలీ..

**- ఉత్తర్వులు జారీ చేసిన జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేస్తున్న 13 మంది ఎస్సైలను బదిలీ అయ్యారు. ఈమేరకు బదిలీ చేస్తూ జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

| ఎస్సై పేరు | ప్రస్తుతం విధులు | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|---|
| 1.సాయికుమార్ | సీసీఎస్ మహబూబ్‌నగర్ | డీసీఆర్‌బీ వనపర్తి |
| 2.వీ సతీష్ | డీఎస్‌బీ మహబూబ్‌నగర్ | వీఆర్ నాగర్‌కర్నూల్ |
| 3. ఎస్ రవిప్రకాశ్ | మహబూబ్‌నగర్ టూటౌన్ | పాన్‌గల్, పీఎస్, వనపర్తి |
| 4.ఎం కల్యాణ్‌కుమార్ | వీఆర్ నాగర్‌కర్నూల్ | డీఎస్బీ జోగులాంబ గద్వాల |
| 5.పి అశోక్‌బాబు | వీఆర్ నాగర్‌కర్నూల్ | డీసీఆర్‌బీ వనపర్తి |
| 6. ఎస్ కృష్ణఓబుల్‌రెడ్డి | బిజినపల్లి పీఎస్ | చిన్నంబావి పీఎస్, వనపర్తి |
| 7.వసూరాంనాయక్ | చిన్నంబావి పీఎస్ | వీఆర్ నాగర్‌కర్నూల్ |
| 8.ఎస్ఎం నవీద్ | డీసీఆర్‌బీ వనపర్తి | సీసీఎస్ మహబూబ్‌నగర్ |
| 9.ఎం స్వాతి | డీసీఆర్‌బీ వనపర్తి | డీఎస్‌బీ మహబూబ్‌నగర్ |
| 10.సీ కురుమయ్య | వీఆర్ జోగులాంబ గద్వాల | నర్వ పీఎస్, నారాయణపేట |
| 11.ఎం జగన్మోహన్ | డీఎస్‌బీ జోగులాంబ గద్వాల | డీఎస్‌బీ నారాయణపేట |
| 12. ఎం విక్రమ్ | నర్వ, పీఎస్ | వీఆర్ జోగులాంబ గద్వాల |
| 13. ఎండీ అఫ్జల్ | డీఎస్‌బీ, నారాయణపేట | డీఎస్‌బీ, మహబూబ్‌నగర్ |

# దేవరకద్ర నియోజకవర్గంలో రూ.80 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

**- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి - గూరకొండలో పాఠశాల ప్రారంభం**

**దేవరకద్ర, జూన్ 20 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలో రూ.80 కోట్లతో పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతు న్నాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. దేవరకద్ర మండలం గూరకొండలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యాధినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దాదాపు రూ. 72లక్షలతో చేపట్టిన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ఆల మాట్లాడారు. తెలంగాణలోని ప్రభుత్వ బడులల్లో నిరుపేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయి విద్యను అందించడం జరుగుతుందన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌనికవసతులను ప్రభుత్వం కల్పించిదన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాలచే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, ప్రొజెక్టర్, స్మార్ట్‌టీవిల ద్వారా పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని కూడ అందించడం జరుగుతుందన్నారు. గురుకులాలను ఏర్పాటుచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కావున విద్యాపథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని లబ్దిపొందాలన్నారు.



గూరకొండలో పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆల

**ఎమ్మెల్యే ఆలకు ఘనస్వాగతం..**

గూరకొండ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకొన్నారు. వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో జడ్పీటీసీ అన్నపూర్ణశ్రీకాంత్, యంపీపీ కెంగూరి రమాశ్రీ కాంత్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్‌పాష, దేవరకద్ర పిఏసిఎస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మూడా సభ్యుడు కరుణం రాజు, దేవరక ద్ర వ్యవసాయ మార్కెట్ ఛైర్మెన్ విజయ వెంకటేశ్, నాయకులు రంగయ్యగౌడ్, వీరప్పయ్య దేవస్థానం ఛైర్మెన్ శివానం ద్, దేవరకద్ర పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నూరు బాల్‌రాజ్, కొండ భాస్కర్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల

## వీపనగండ్ల మండల అభివృద్ధే నా ధ్యేయం

**- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి - ఎవరు చేయలేని అభివృద్ధిని నేను చెప్పి అభివృద్ధి చేస్తున్నాను**

**వీపనగండ్ల, జూన్20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పుల్గర్‌చర్ల గ్రామంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. పుల్గర్‌చర్ల గ్రామంలో పెంట్లవెల్లి ఎక్స్ రోడ్డు నుండి శ్రీరంగాపురం వరకు తూముకుంట, పుల్గర్ చర్లమీదుగా శ్రీరంగాపూర్ వరకు ఐదు కోట్ల నిర్మాణ వ్యయంతో బీటీ డబల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జమ్ములమ్మగుడి దగ్గర ప్రత్యేకపూజలు నిర్వహించి ఈప్రాంత ప్రజలకు - మిగతా2లో..



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## ప్రతి మంగళవారం మహిళలకు ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమం : డాక్టర్ వంశీకృష్ణ



**వీపనగండ్ల,జూన్20,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళా ఆరోగ్యం కార్యక్రమం చేపడుతున్నామని మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశనయంతో కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నదని, ప్రతి మంగళవారం మహిళాఆరోగ్యం అనే కార్యక్రమం గురించి వివరిస్తు 18సం. నుండి 65 సం.లు ఉన్న ప్రతి ఒక్క మహిళ బిపి, డయాబెటిస్, సర్వికల్ క్యాన్సర్ తదితర వ్యాధులకు ప్రతి మంగళవారం ప్రత్యేకంగా చికిత్స కార్యక్రమం ఉంటుందన్నారు.డాక్టర్ నదియా పర్యవేక్షణలో అవగాహన సదస్సు, చికిత్స చేయబడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి మండలాల్లో మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల నిర్వహించిన రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను మంగళవారం ఐదో రోజు కొనసాగింది. టీఎస్ఎల్‌పీఆర్‌బీ నియమ, నిబంధనల మేరకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని ఎస్పీ నరసింహ తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలోని 500మంది అభ్యర్థులకుగానూ 457మంది అభ్యర్థులు హాజరయ్యారని,వారందరి ధ్రువపత్రాలు పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, ఏవో రుక్మిణిబాయి, సాయుధ దళ డీఎస్పీ శ్రీనివాసులు, సూరింటెండెంట్ యహోవాదాస్, ఐటీసెల్, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ



**అడ్డాకుల, జూన్20,ప్రభాతవార్త:**అడ్డాకుల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పురవీధుల లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్ ఎం ఉమాపతి రెడ్డి పాఠశాలలో జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ప్రజాప్రతినిధులచే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. తెలంగాణ వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జునరెడ్డి, గ్రామ సర్పంచ్ మంజుల, పీఏసీఎస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షులు తిరుపతిరెడ్డి, పీఎస్ ప్రధానోపాధ్యాయులు భద్యా నాయక్, కమిటీ చైర్మన్ రాములు యాదవ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మున్సిపాలిటి అవార్డు...



**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటి కల్వకుర్తి మున్సిపాలిటిని హరిత తోరణంగా ఏర్పాటు చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి హరితహారంలో విశేషంగా కృషి చేసినందుకు కల్వకుర్తి మున్సిపాలిటి ఉత్తమ అవార్డును అందుకున్నది. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం హరితహారంలో ఉత్తమ మున్సిపాలిటి అవార్డును అందుకున్నారు. మంగళవారం రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడం పట్ల కల్వకుర్తి బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ ఆశిత్‌కుమార్‌లను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యా దినోత్సవం



**మాగనూరు,జూన్ 20 ప్రభాతవార్త :** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులు,పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్ ఓపెనింగ్, రాగిజావా పంపిణీ అదేవిధంగా పిల్లలకు పాఠ్యపుస్తకాల పంపిణీ కూడా చేయడం జరిగింది. అదేవిధంగా విద్యా అభిమానుల సమక్షంలో ప్రభుత్వపాఠశాలల బలోపేతానికై విద్యార్థులశ్రేయస్సు రిత్యా పెద్దలందరుకూడా పాఠశాల అభివృద్ధికి వెన్నంటే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్ఎంసి కమిటి చైర్మన్ సర్పంచ్, స్కూల్ డెవలప్‌మెంట్ మెంబర్లు పాల్గొన్నారు.

## కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా విద్యా దినోత్సవం

**-తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ఘన సన్మానం**




**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:**కల్వకుర్తి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ముఖ్య అతిథిగా,ఆత్మీయ అతిథులుగా రిటైర్డు లెక్చరర్ సుధాకర్, బాలయ్యలు హాజరయ్యా రు. ఈ సందర్భంగా కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, జిల్లా రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌లు సాధించిన వారికి రూ.1000ల ప్రైజ్‌మని అందించారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు బాలయ్య రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వేణు, సదానందం, మల్లేష్, రమా కాంత్, నయీం, పరుశరాం, శ్రీనివాస్, బాలరాజు, రాజేష్, భీమేష్, గిరిబాబు, లక్ష్మయ్య, సంతోష్, బాలయ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా విద్యా దినోత్సవం



**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని బాల్‌రాంనగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ 9 సంవత్సరాల్లో సీఎం కేసీఆర్ సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టారని, గురుకుల విద్యా లయాలను స్థాపించి పేద విద్యార్థులకు చదువును మరింత దగ్గర చేశారన్నారు. విద్యతోనే ఉజ్వలభవిష్యత్తు ఉందని గ్రహించి విద్యారంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల బృందం తదితరులు ఉన్నారు.

## వాహనం బోల్తా.. ఒకరు మృతి నలుగురికి గాయాలు..

**కొత్తకోట,జూన్20,ప్రభాతవార్త:** మండల పరిధిలోని అమడబాకుల స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్ 44పై బొలెరో వాహనం టైరు పగిలి బోల్తా పడిన ఘటనలో మహమ్మద్ సిరాజ్ (38) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ కట్ట మైసమ్మ బస్తీ నుండి సోమవారం అర్ధరాత్రి బయలుదేరి హైదరాబాద్‌నుండి నంద్యాలకు వెళ్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున అమడబాకుల స్టేజీ సమీపంలోకి రాగానే టైర్ పంచర్ కావడంతో టైర్ పగిలి బొలెరో వాహనం బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న అనిల్ కుమార్, సునీల్ కుమార్, కృష్ణయ్య, అస్రప్ రాజు లకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.బొలెరో వాహనంలో పీవోపి బస్తాలను తీసుకువెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా వీరంతా అందులో కూలీలుగా పని చేసే వారని మృతుని కుటుంబ సభ్యులు మహమ్మద్ ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు ప్రారంభించాలి..

**- వైద్యాధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త:** బాదేపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం నుంచి యధావిధిగా వైద్య సేవలు ప్రారంభించాలని వైద్యాధికారులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉన్న పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే సదర్శించారు. కల్వకుర్తి రోడ్డులో 100పడకల దవాఖాన ప్రారంభం కావడంతో సీహెచ్‌సీలో వైద్య సేవలు నిలిపివేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు ప్రారంభించాలని, బస్తీ దవాఖాన కోసం కేటాయించిన ఇద్దరు వైద్యులను సీహెచ్‌సీలో పని చేసేలా చూడాలని చెప్పారు. అనంతరం దవాఖానల ఆవరణలో హోమియోపతి డిస్పెన్సరీని సందర్శించారు. ఎమ్మెల్యే వెంట గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, వైద్యాధికారులు డా శివకాంత్, వసుంధర తదితరులు ఉన్నారు.

**ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు..**

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు రాజుగౌడ్, రామకృష్ణగౌడ్ తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పని చేసే కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పార్టీ పథకాలు, కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నెం గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ దేవా, నాయకులు పిట్టల మురళి, పాలాది రామ్మోహన్, నాగిరెడ్డి, బీకేఆర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

**- నెలాఖరుకు మైనార్టీల కమిటీలు పూర్తి చేయాలి**

**- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సోహైల్, డీసీసీ అధ్యక్షుడు జిఎంఆర్**



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూన్20, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గతంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సోహైల్, డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావే శంలో వారు మాట్లాడారు. జిల్లా మైనార్టీ నాయకులు విస్తృతంగా పర్య టించి మండల, గ్రామ స్థాయిలో కమిటీలు వేయాలని, నెలాఖరు వరకు కమిటీల నియామకం ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తా మని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కి మైనార్టీలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీ ల అభ్యున్నతికి కృషి జరిగిందని, ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచిందన్నారు. కమిటీల ఏర్పాటు ప్రక్రియ త్వరిత గతిన ఏర్పాటు చేయాలని, ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. వారానికి మూడు రోజులు కేటాయించి, ప్రజల్లో ఉండాల ని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అక్తర్, దేవరకద్ర నియోజవర్గ అధ్యక్షుడు అహ్మద్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, టౌన్ మైనార్టీ అధ్యక్షుడు అజ్మత్ అలీ పాల్గొన్నారు.

# ధ్యానంతో విద్యార్థుల పిట్యూటరీ గ్రంథి శుభ్రం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉట్కూర్,జూన్ 20 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలోపాఠశాలలో ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతినిత్యం ధ్యానం చేయడం వల్ల పిట్యూటరీ గ్రంథి శుభ్రపడి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. ధ్యానం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని వారన్నారు. సోమవారం బిజ్వార్, మొగ్దుంపూర్ గ్రామాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ధ్యాన శిక్షణ ఇచ్చారు. ధ్యానం చేయడం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని, పరీక్ష లాంటి భయం తొలగిపోతుందని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా విశ్వశక్తి ప్రసారం జరిగి నాడీ మండల శుద్ధిజరుగుతుందని ఆయన అన్నారు. చిన్నప్పుడే ధ్యానం చేయడం వల్లరోగనిరోధక శక్తిపెరిగి భవిష్యత్తులో వ్యాధులు రావని అన్నారు. చదువుల పరమైన లాభాలు ఆరోగ్యకరమైన లాభాలు పొందుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ధనుంజయ, గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ, విద్యా కమిటి అధ్యక్షులు ఆశప్ప, కృష్ణయ్యగౌడ్, ఉపాధ్యాయులు రవింద్రరావు, నరసింహులు, విజయలక్ష్మి, అపర్ణ పాల్గొన్నారు.

# రక్తదానం చేయడం వల్ల మరో ప్రాణం కాపాడవచ్చు..

**- కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి**



రక్తదానం చేస్తున్న దృశ్యం

**అమరచింత,జూన్20,ప్రభాతవార్త:**ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల మరో ప్రాణం కాపాడడానికి యువకులు ముందుకు రావాలని కాంగ్రెస్‌పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి యువకులకు పిలు పునిచ్చారు. మంగళవారం అమరచింత ము న్సిపల్ కేంద్రంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్ర తినిధి కేశం నాగరాజు గౌడ్ జన్మదిన వేడుక ల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్ జన్మ దిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అయూబ్ ఖాన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రజా సేవ కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు ముం దుండాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కెజి మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్, శ్యాం, విష్ణు, లక్ష్మికాంత్‌రెడ్డి, హన్మంత్ నాయక్, నాగు నాయక్, ప్రకాశం, శ్రీధర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం మన ఊరు మనబడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**ఉట్కూర్,జూన్ 20 ప్రభాతవార్త :** తెలంగాణ ద్విశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంళవారం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపియుపిఎస్ నిడుగుర్తి పాఠవాలలో మన ఊరు మనబడి ద్వారా పాఠశాలలో కల్పించబడిన నూతన తరగతి గదులు, గ్రంథాలయ గదులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల తెలంగాణ ఆవిర్భావం అనంతరం కార్యక్రమంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు.ముఖ్యంగా బీద,బడుగు, బలహీన వర్గాల ప్రజలు చదివే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందితే రాష్ట్రమే ముందుకు పోతుందనే ఉద్దేశంతో మన ఊరు మనబడి అనే గొప్ప కార్యక్రమం తీసుకువచ్చి కార్పోరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని వసతులు కల్పించడం ఇప్పుడు చదువుతున్న విద్యార్థులు చేసుకున్న అదృష్టం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఎల్కోటి లక్ష్మినారాయణరెడ్డి, జడ్పీటిసి సభ్యులు అశోక్‌కుమా ర్‌గౌడ్, సర్పంచ్ యశోదమ్మ, ఎంపిటిసి సభ్యులు వీరరాఘవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఛైర్మన్లు నర్సింహులు, మక్బుల్‌ఖాన్,ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, సుజాత, సలాం, లియాకత్, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# రూ.10లక్షలతో..60వేల నోట్‌బుక్కులు..!

**- ఎంపీపీ డా.కదిరె శేఖర్‌రెడ్డి దాతృత్వం..**

**- భూత్పూర్ మండలంలోని 58పాఠశాలల విద్యార్థులకు పంపిణీ**

**- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి..**



నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆల, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త :** భూత్పూర్ ఎంపీపీ డా.కదిరె శేఖర్‌రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. భూత్పూర్ మండలంలోని 58పాఠశాలల విద్యార్థులకు తన సొంత డబ్బులు రూ.10లక్షలతో 60వేల నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భూత్పూర్ మండలం కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యాదినోత్సవంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూత్పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.06కోట్లతో మన ఊరు మన బడి కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి ముందుచూపుతో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని, ఇంగ్లీష్ మీడియం కూడా ప్రారంభం కావడంతో సర్కార్ బడుల్లో పిల్లల నమోదు సంఖ్య పెరిగిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ఆలోచనలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతున్నాయన్నారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై రూ.లక్షా 20వేలు ఖర్చు చేస్తూ కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కదిరె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని మండలానికే కాకుండా నియోజకవర్గానికి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మత్స్యసహకార సంఘం నాయకుడు మనెమోని సత్యనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆల

## అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత ప్రయాణం

**టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి**



**దేవరకద్ర,జూన్ 20 ప్రభాతవార్త:**కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళ లకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు.దేవరకద్రలో ఆయన మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి కాంగ్రెస్ పార్టీకి సహకరించాలన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఖచ్చితంగా నెరవేరుస్తుందన్నారు.కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని కాంగ్రెస్ నెరవేర్చిన విషయం అందిరికి తెలిసిందన్నారు. ఇదే తరహాలో తెలంగాణలో కూడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంబడే మహిళలకు ఉచితప్రయాణ సౌకర్యాన్ని కాంగ్రేస్‌పార్టీ కల్పిస్తుందన్నారు.

## పాఠశాలకు ఎల్ఈడి టీవిని అందజేత



**దేవరకద్ర,జూన్ 20 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం నార్లోనికుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలకు మంగళవారం బీఆర్ఎస్ మండల అ ధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్ రూ.34వేల విలువ చేసే ఎల్ ఈడి టీవిని అందజేశారు. తెలంగాణ రాష్ట్రఅవతరణ దశాబ్దిఉత్సవాలలో భాగంగా విద్యాధినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ ఎల్ఈడి టీవిని పాఠశాలకు ఆయన అందజేశారు.అలాగే యంపీపీనిధులతో చేపట్టిన హైమాక్స్ లైట్లను కూడ శ్రీకాంత్‌యాదవ్ ప్రారంభించారు.ఈ కార్యక్ర మంలో గ్రామస్థులు,బీఆర్ఎస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా శాఖ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ



**వనపర్తి విద్యావిభాగం,జూన్20,ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ అంకూరు గ్రామ పాఠశాలలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల చదువుకు తమ వంతు సహాయంగా స్వామి వివేకానంద యువజన సంఘం కృషి చేస్తున్నందుకు సంఘం అందరి తరపున సంఘం వ్యవహారాల ఇంచార్జీ రవి శేఖర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాధమ్మ,ఉపాధ్యాయురాలు అరుణ,అంగన్వాడీ టీచర్లు నిర్మల,పద్మ,ఆయాలు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పోరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**మద్దూరు,జూన్ 20 ప్రభాతవార్త :**తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవ వేడుకలు మద్దూరు మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుల పండగను ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి పాల్గొన్నారు.అనంతరం మనఊరు మనబడి పాఠశాలల భవన నిర్మాణానికి రూ. 85లక్షల నిధులతో శంకుస్థాపన చేశాడు.గ్రంథాలయాలు, డిజిటల్ తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు.కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ నాయకులు,మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 13వ వార్డులో విద్యాదినోత్సవం..



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జెండా కార్యక్రమం నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతోపాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం లభిస్తుందని, సర్కార్ బడుల్లో వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమాకాత్యాయని,ఉపాధ్యాయురాలు గౌసియాబేగం, అంగన్‌వాడీ టీచర్ మాణిక్యమ్మ, బీఆర్ఎస్ యువ నాయకుడు సాయి పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన చేయూత సభ్యులు

**మిడ్జిల్,జూన్ 20 ప్రభాతవార్త :** మండలంలో నవ తెలంగాణ విలేఖరి రాజేష్‌కుమార్ గత నెల పదిరోజుల క్రితం బైక్‌పై నుండి పడి కాలికి గాం అయిందని తెలుసుకున్న చేయూత సభ్యులు మంగళవారం వాడాల గ్రామంలో ఆయన నివాసంలో పరామర్శించారు. అతని ఆరోగ్య విషయాలను ఆర్థిక విషయాలను తెలుసుకుని మేమున్నామని వారిని ఓదార్చి ఆదరించి ఆర్థిక సహయం పదివేల రూపాయలు అందజేశారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సరైన వైద్యం చేయించుకుని త్వరగా కోలుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చేయూత సభ్యులు మాజీ ఎంపిటిసి శివప్రసాద్, వెలుగొండ బాబా రాఘవేందర్‌రెడ్డి, రవిందర్ గౌడ్, వెంకటయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి,శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వీపనగండ్ల మండల అభివృద్ధే నా ధ్యేయం..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పంటలు మంచిగా పండాలని కోరుకున్నారు. 90లక్షలతో రోడ్డుకిరువైపులా డ్రైనేజ్ నిర్మాణానికి మంజూరు చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించుకున్నామని అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన అభివృద్ధి చేయడంలో ఎక్కడ రాజీపడనని ఎమ్మెల్యే తెలిపారు.

# రోగులకు ప్రభుత్వ ఆసుపత్రి భరోసా

- ◆మెరుగుపడ్డ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు
- ◆నాటి దయనీయ పరిస్థితులు అధిగమించి నేడు ఎంతో పురోగతి
- ◆జిల్లా ఆసుపత్రి నుండి జనరల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్
- ◆330 పడకలతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- ◆ఎంసీహెచ్‌లో నెలకు 400కు పైగా నమోదవుతున్న కాన్పులు
- ◆వైద్యం కోసం ప్రతి ఒక్కరి అడుగులు ప్రభుత్వ ఆసుపత్రి వైపే
- ◆పలు సంక్షేమ పథకాలే ప్రభుత్వ ఆసుపత్రుల మెరుగుకు కారణం అంటున్న వైద్య విశ్లేషకులు



క్యాన్సర్ డే కేర్ సెంటర్, కీమోథెరపీ సెంటర్, వయోవృద్ధుల కొరకు ఎల్డర్లి క్లినిక్ లను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

**వనపర్తి వైద్య విభాగం,జూన్20,ప్రభాతవార్త:** సామాన్యుడు ఒకనాడు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే భయపడేవాడు. అలాంటి దయనీయ పరిస్థితుల నుండి నేడు నేడు ఎంతటి పేదవాడైనా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యమే మేలు అనుకుంటూ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తున్నారు. మంచి నాణ్యమైన వైద్యం పొందడమే కాకుండా చాలా ధైర్యంగా ఎంత పెద్ద రోగమైన సర్కారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దానికి గల కారణం నేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వచ్చిన మార్పులు. పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు, గర్భిణీలకు, బాలింతలకు ఇలా ప్రతి ఒక్కరికి ఒక నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగు పరచడమే కారణం. ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 100 కాన్పులు జరిగితే అది చాలా గొప్ప విషయం అనుకునేవాళ్లం. కానీ నేడు దాదాపు 500 కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్నాయి. అంతేకాకుండా ఎక్స్‌రేలు, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, ఈసీజీ ఇలా అన్ని రకాల వైద్య పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయడం జరుగుతుంది. మరికొద్ది రోజులలో ప్రారంభం కాబోతున్న టీ హబ్‌లో 57 రకాల వైద్య పరీక్షలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

**పెరుగుతున్న ప్రసవాలు:** ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను ప్రభుత్వం ఎంతో మెరుగుపరుస్తుంది. ఇదే తరుణంలో ప్రజలను ప్రభుత్వాసుపత్రి వైపు మళ్లించేలా కేసీఆర్ కిట్టు, 102 ఉచిత వాహన సేవ, అమ్మ ఒడి, నగదుబదిలీ పథకం ఇలాఅనేక ప్రజా ఆరోగ్యసంక్షేమ పథకాలనుఅమలు చేస్తు సత్ఫలితాలనుసాధిస్తుంది.గత ఏడాది జనవరి మాసంలో జిల్లా కేంద్రం సమీపంలోని నర్సింగాయపల్లి గ్రామ శివారులో మంత్రులు హరీష్ రావు,నిరంజన్‌రెడ్డిల చేతుల మీదుగా దాదాపురూ.17 కోట్లతో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుండి గర్భిణీల తాకిడి మాతా శిశు సంరక్షణ కేంద్రానికి గణనీయంగా పెరగడమే కాకుండా కాన్పుల సంఖ్యకూడా గతంలోకంటే నాలుగైదింతలు అధికమవుతున్నాయి. ఒకనాడు ప్రభుత్వ ఆసుపత్రికి కాన్పు కోసం వచ్చిన గర్భిణీకి ఏ చిన్న సమస్య తలెత్తిన వెంటనే మహబూబ్ నగర్, హైదరాబాద్ వంటిదూర ప్రాంతాలకు రెఫర్ చేసేవారు. కానీ నేడు హైరిస్క్ కేసులను సైతం మాతా శిశు సంరక్షణ కేంద్రంలోనే చేస్తు గర్భిణీలకు భరోసా కల్పిస్తు సుఖ ప్రసవాలు చేస్తున్నారు.

**కార్పొరేట్ తరహా వైద్య సేవలు:** జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి గతంలో ఏరియా ఆసుపత్రిగా ఉండేది. నేడు ఏరియా ఆసుపత్రి నుండి జిల్లా ఆసుపత్రిగా , జిల్లా ఆసుపత్రి నుంచి జనరల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ సాధించడంతో ప్రజలకు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందుతున్నాయి. మాతా శిశు సంరక్షణ కేంద్రం, జిల్లా జనరల్ ఆసుపత్రిగా రెండు భాగాలు చేసి ప్రజలకు వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చిన్న పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తుండగా, జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఆర్థో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, సైకియాట్రి, డెంటల్ వంటి సేవలను కొనసాగిస్తున్నారు. ఇటీవలే క్యాన్సర్ డే కేర్ సెంటర్ , కీమోథెరపీ సెంటర్, వయోవృద్ధుల కొరకు ఎల్డర్లి క్లినిక్, ధూమపానం బారిన పడిన చిన్నారులకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు డి అడిక్షన్ కేంద్రంను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. రెండు ఆసుపత్రుల్లోకలిపి స్కానింగ్ సేవలుకూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలో సిటీ స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. జనరల్ ఆసుపత్రిలో నిత్యం ఆర్థో, జనరల్ సర్జరీలు కావడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోతుంది.

### మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం..



జిల్లా ఆసుపత్రి నుండి జనరల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ పొందినప్పటి నుంచి రోగులకు కార్పోరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తు న్నాం. గతంలో నెలకు 100 కాన్పులు జరిగితేనే ఎంతో గొప్ప, కానీ నేడు ప్రతి నెల 450కి పైగా ప్రసవాలు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాకు క్రిటికల్ కేర్ యూనిట్, ట్రామకేర్ సెంటర్లుకూడా మంజూరుకావడం జరిగింది. త్వరలో టీ హబ్ ద్వారా రోగులకు 57 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. రానున్న కొద్ది రోజుల్లో జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**- డాక్టర్ నరేంద్రకుమార్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, వనపర్తి**

### మూడు కాన్పులు సాధారణ ప్రసవాలే చేశారు



నాకు ముగ్గురు సంతానం.మూడు ప్రసవాలు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయించుకున్నారు. మా కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసు పత్రికి పోదామని చెప్పినప్పటికీ నేను వినలేదు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే చూయించుకున్నాను. మూడు సాధారణ కాన్పులే చేశారు. గతంలో ప్రభు త్వ ఆసుపత్రి అంటేనే ఎంతో భయమేసేది. కానీ ఇప్పుడు ప్రైవేటు ఆసుపత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రిలోనే మంచిగా చూస్తున్నారు.

**- శ్రీవాణి, గృహిని, బ్రహ్మంగారి వీధి, వనపర్తి**

## ఘనంగా విద్యా దినోత్సవం



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

**పెద్దమందడి,జూన్20,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి,ఎస్ఎంసి చైర్మన్ రవి, ఎంపీడీవో అఫ్జల్, వార్డు సభ్యులు రామాంజనేయులు, గ్రామ పెద్దలు పల్లా సత్యనారాయణ, మాజీ ఎస్ఎంసి చైర్మన్ సేనాపతి చారిలు పాల్గొని ప్రసంగించారు. ప్రధానోపాధ్యాయులు విద్యామంత్రి సందేశాన్ని వినిపించారు. సీనియర్ ఉపాధ్యాయులు గోపినాథ్ పాఠశాల ప్రగతి నివేదిక చదివి వినిపించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ తెలుగు పండిత్ గిరిరాజా చారి, ఉపాధ్యాయుడు మల్లేష్ లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. హిందీ పండిత్ ఎండి రఫీ వందన సమర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకాంత్, శివయ్య, కురుమూర్తి, సుదర్శన్ గౌడ్, ఖాదర్ పాషా,కుమార్, నాగరాజు,శాంతన్న, జగదీష్‌బాబు, గోవిందు, సాయి చందురెడ్డి పాల్గొన్నారు. గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువా, నగదుతో సన్మానించారు.ఎన్ఎంఎంఎస్ సాధించినఆరుగురు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులతో పాటు యూనిఫామ్ , నోటు పుస్తకాలను అందించారు. విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, రంగోలి పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు ప్రధానం చేశారు.

## బీసీ కుల వృత్తిదారులకు రూ.1లక్ష ఆర్థిక సహాయం గడువును పెంచాలి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:** బీసీ కుల వృత్తి దారులకు రూ.1లక్ష ఆర్థిక సహాయం గడువును పెంచాలని కోరుతూ కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి మంగళవారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కుల ఆదాయం సర్టిఫికెట్లు తీసుకోవాల్సిన సమయంలో మీ సేవ కేంద్రంలో ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో ప్రభుత్వం గడువును మరిన్నిరోజులు పెంచాలన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సైదులుయాదవ్, గణేష్‌యాదవ్, నానియాదవ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులు, విద్యా కమిటి సభ్యులకు సన్మానం

**ధరూర్,జూన్ 20 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, హరిజన్, సిపిఎస్, కుర్వవీధి పాఠశాల, జడ్పీహైస్కూల్ పాఠశాలతోపాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యా దినోత్సవ వేడుకలు ఆయా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు కలిసి గ్రామాలలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రతి విద్యార్థి చదువుకోవాలని, మంచి అలవాట్లకు దగ్గర కావాలని సూచిస్తూ నినాదాలు చేస్తూ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జాతీయ జండాలను ఎగురవేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటి సభ్యులను సన్మానించారు.

## విద్యారంగంలో సీఎం కేసీఆర్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు



వెల్దండలో మానవహారం నిర్వహించిన దృశ్యం

**వెల్దండ, జూన్ 20 ప్రభాతవార్త:** ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ విద్యను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన ప్రగతిని సాధించి ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. రాష్ట్ర అవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని మండల వ్యాప్తంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయబృందం, ప్రజా ప్రతినిధులతో కలిసి ఘనంగా నిర్వహించి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. వెల్దండ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాస్‌లు సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలు పాఠశాల జాతీయ రహదారిపై మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 9 సంవత్సరాల్లో సీఎం కేసీఆర్ సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టారని,గురుకుల విద్యాలయాలను స్థాపించి పేద విద్యార్థులకు చదువును మరింత దగ్గర చేశారన్నారు. విద్యతోనే ఉజ్వలభవిష్యత్తు ఉందని గ్రహించి విద్యారంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించి డిజిటల్‌తరగతులను ప్రధానోపాధ్యాయులుతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు క్యాసారపు వెంకటయ్య, రంగయ్య, రాధకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి,యాదగిరి, ప్రసాద్, శ్రీను, శేఖర్, జహేదా, జంగిలి ఆనంద్ తదితరులు ఉన్నారు.




వెల్దండలో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

## పేదల స్వంత ఇంటి కలను సాకారం చేయబోతున్నాం

**స్థలం ఉండి స్వంత ఇళ్లు లేని వారికి త్వరలో రూ.3 లక్షల ఆర్థిక సహకారం : వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,జూన్20,ప్రభాతవార్త:** స్థలం ఉండి స్వంత ఇళ్లు లేని వారికి త్వరలో రూ. 3 లక్షల ఆర్థిక సహకారంతో పేదల సొంతింటి కల పూర్తి చేయడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం విద్యా దినోత్సవ వేడుకల సందర్భంగా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో మన ఊరు మన బడి కింద మండల ప్రాథమిక పాఠశాల (ఇంగ్లీష్ మీడియం) ను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... స్థలం ఉండి స్వంత ఇళ్లు లేని నిరుపేదలకు వచ్చే నెలలో జిల్లా యంత్రాంగం ద్వారా సర్వే నిర్వహించిన ఇళ్లు లేని వారి జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. ఇందులో అర్హులైన వారికి రూ.3 లక్షల ఆర్థిక సహాయంతో పేదల స్వంత ఇంటి కలను సాకారం చేయబోతున్నామని తెలిపారు. అదే విధంగా స్థలం లేని వారికి గుర్తించి ఇళ్ల స్థలాలు సైతం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో పార్టీలకతీతంగా పూర్తి పారదర్శకంగా ఇళ్ల మంజూరు ఉంటుందని ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండబోదని తెలియజేశారు. అదే విధంగా ఊరి ప్రజలు తెలియక ఒక ఫైనాన్స్‌లో డబ్బులు పెట్టి మోసపోయిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే ఎవరి డబ్బులు వారికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలకు భరోసా కల్పించారు. జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ , జడ్పీటీసీలు,ఎంపీపీలు, సర్పంచు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రి వెంట పాల్గొన్నారు.



అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## విద్యార్థులకు రాగిజావ పంపిణీ

**నారాయణపేట ప్రతినిధి,జూన్20 ప్రభాతవార్త:** తెలంగాణ విద్యా దినోత్సవం సందర్భంగా ఎంపిపిఎస్ ఎస్సీవాడ మక్తల్ పాఠశాలలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి పాఠశాల ఆవరణలో జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతోపాటు పాఠశాల చైర్మన్ మల్లేష్, స్థానిక కౌన్సిలర్ సత్యనారాయణ మాట్లాడుతూ కార్యక్రమంలో పాలోనడం సంతోషదాయకమని తెలిపారు. పాఠశాల నుండి గురుకులాలకు ఎంపికైన ఐదవ తరగతి విద్యార్థినిలు అంకిత, కీర్తిలను శాలువాలతో సన్మానించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం, ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రాగిజావ విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యా యులు గోపాల్, సహ ఉపాధ్యాయులు శ్రీని వాస్ రావు, రవిందర్, వనజ, లోక్‌సత్తా నాయ కులు నారాయణ, కిష్టప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

● రాష్ట్ర పర్యాటక, ఆబ్కారి శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూన్20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దబడ్డాయని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విద్యా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పాఠశాలల్లో చాలీచాలని బెంచీలు, పడిపోయిన తరగతి గదులు, తాగడానికి మంచినీరు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, మధ్యాహ్న భోజనం కూడా ఉండేది కాదని ఉప్మ పెట్టేవారని, ఇప్పుడు ఉప్మాస్థానంలో మధ్యాహ్నం భోజన పథకం వచ్చిందని, ఎలాంటి ఫీజులు లేవని, అంతేకాక మౌలిక వసతులు పెరిగాయని,టీచర్లసంఖ్య పెరిగిందని, దేశంలోనే ఎక్కువ జీతాలు ఇస్తున్న రాష్ట్రంగాతెలంగాణ నిలిచిందని అన్నారు. జిల్లాలో 100కు పైగా గురుకుల పాఠశాలలుఉన్నాయని,ఆరు రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని,పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు అన్ని మారిపోయామని అన్నారు. ప్రత్యేకించి మహబూబ్‌నగర్‌లో రానున్న రెండేళ్లలో 20 వేల ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత మొట్ట మొదటి మెడికల్ కళాశాల మహబూబ్‌నగర్‌కు వచ్చిందని అలాగే నర్సింగ్ కళాశాల, ఫార్మా కళాశాల వచ్చాయని, మహబూబ్‌నగర్ ఎంతో మారిందని ఆయన తెలిపారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ మన ఊరు మనబడి కింద జిల్లాలో 292 పాఠశాలలను చేపట్టడం జరిగిందని, 13 పాఠశాల లను ఇదివరకే ప్రారంభించగా, మరో 20 పాఠశాలల ప్రారంభానికి సిద్ధం చేసుకోవడం జరిగిందని, పేదరికం, వల్ల చదువు ఆగిపోకూడదని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. అడిషనల్ కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కెసి నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు కోడుగల్‌యాదయ్య,మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, డీఈఓ రవిందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఆయా పాఠశాలలకు ట్యాబులను పంపిణీ చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్య

**ఇటిక్యాల,జూన్ 20 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యా విద్యార్థులకు అందివ్వడం జరుగుతుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొండేరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని 17 లక్షల 20 వేల రూపాయలతో పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ గొప్ప ఆలోచన ముందుచూపుతో తెలంగాణలో నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించడం జరుగుతుందని మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని అన్నారు. శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయిలో నిలవాలని మీ తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి, రాష్ట్రానికి మంచిపేరు తీసుకుని రావాలనికోరారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయ్‌కిరణ్, స్థానిక సర్పంచ్ ఈరన్న, పెద్దదిన్నె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వీరాపురం సర్పంచ్ రాముడు, పంచాయతీరాజ్‌ఏఈ పాండురంగారావు, నాయకులు శివుడు, తిమ్మారెడ్డి, ఈదన్ననాయుడు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అందుకున్న జగ్‌బోయినపల్లి గ్రామ పంచాయతీ

**మిడ్జిల్,జూన్ 20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో హరితహారంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు జగబోయిన్‌పల్లి గ్రామం మండలం ఊరుకొండ జిల్లా నాగర్‌కర్నూల్ ఉత్తమ సేవా ప్రశంసా పత్రాన్ని అటవిశాఖ ఆధ్వర్యంలో అందుకున్నారు. జగబోయినపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని రకాల మొక్కల పెంపకాలతోపాటు ప్రత్యేకంగా వివిధ పండ్ల మొక్కలను గ్రామ పంచాయతీలో సంపద వనం ఏర్పాటు చేసినందున ఉత్తమ అవార్డును సర్పంచ్ కవితా మనపాల్‌రెడ్డి,సెక్రెటరీ హరిబాబు రవింద్రభారతిలో ఉపముఖ్యమంత్రి మహ్మద్ అలీ,అటవిశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మంత్రుల చేత మీదుగా అవార్డును అందుకున్నారు. ఊరుకొండ మండలంలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు రావడం పట్ల ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు,గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## టైర్ పగిలి బొలెరో వాహనం బోల్తా

### - ఒకరు మృతి, నలుగురికి గాయాలు

**కొత్తకోట,జూన్20,ప్రభాతవార్త:** మండల పరిధిలోని అమడబాకుల స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్ 44పై బొలెరో వాహనం టైరు పగిలి బోల్తా పడిన ఘటనలో మహమ్మద్ సిరాజ్ (38) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ కట్ట మైసమ్మ బస్తీ నుండి సోమవారం అర్ధరాత్రి బయలుదేరి హైదరాబాద్‌నుండి నంద్యాలకు వెళ్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున అమడబాకుల స్టేజీ సమీపంలోకి రాగానే టైర్ పంచర్ కావడంతో టైర్ పగిలి బొలెరో వాహనం బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న అనిల్ కుమార్, సునీల్ కుమార్, కృష్ణయ్య,అస్రప్ రాజులకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.బొలెరో వాహనంలో పీవోపి బస్తాలను తీసుకువెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా వీరంతా అందులో కూలీలుగా పని చేసే వారని మృతుని కుటుంబ సభ్యులు మహమ్మద్ ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**వీపనగండ్ల,జూన్20,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలం రంగవరం గ్రామంలో 20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధులతో సర్పంచ్ జయసుధతో కలిసి శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు తెలంగాణ సాధనే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారని పల్లె ప్రగతి ద్వారానే బంగారు తెలంగాణ సాధ్యమని, పల్లెలను అభివృద్ధి దిశగా పయనించేలా కృషి చేస్తున్నారని అన్నారు. సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కమలేశ్వర్‌రావు,పార్టీ అధ్యక్షుడు ఉప సర్పంచ్ హర్షవర్ధన్‌రెడ్డి, ప్రజాప్రతి నిధులు,అధికారులు, బీఆర్ఎస్ నాయ కులు యాదవ స్వామి, ఎద్దుల సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్ సన్నాహక సమావేశం

**చిన్నంబావి,జూన్20,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ ఆడిటోరియంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి క్విజ్ కాంపిటీషన్ గురించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రంగినేని అభిలాష్ రావు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా యువత మేల్కొనే దిశగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరీ పరమేష్, వనపర్తి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంటే శివన్న, జిల్లా సేవాదళ్ జనరల్ సెక్రటరీ రఫీ ఉద్దీన్, వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మద్దిలేటి, పెద్దకొత్తపల్లి , వీపనగండ్ల, పెంట్లవెల్లి మండలాల అధ్యక్షులు కృష్ణయ్య, గోదల బీరయ్య యాదవ్, నరసింహ యాదవ్, తాలూకా యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వహీద్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగయ్య యాదవ్, తాలూకా సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేష్ యాదవ్, వీపనగండ్ల కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, టౌన్ వైస్ ప్రెసిడెంట్ బాబా, చిన్నంబావి, వీపనగండ్ల మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సహిద బేతం, సుకన్య, మండలాల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉపాధ్యక్షులు గ్రామ పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలిచ్చిన వారికి స్థలాలు చూపాలి



మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

**వనపర్తి టౌన్, జూన్20, ప్రభాతవార్త:** ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చిన వారికి స్థలాలు చూపాలని పట్టాలు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి ద్వారా రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మంగళవారం దళితవాడ, ఎన్‌టీఆర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి15 లక్షలుఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. వనపర్తి పట్టణంతో పాటు వనపర్తి మండలం లోని గ్రామాలలో ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నిధు లు మంజూరు చేయాలని పట్టాలు గతంలో ఇచ్చిన వారికి స్థలాలు చూపాలని, ఇల్లు లేని పేదలంతా వ్యక్తిగత దరఖాస్తులతో జూన్ 24న శనివారం ఉదయం 10 గంటలకు వనపర్తి అంబేద్కర్ చౌక్‌కు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, గంధం గట్టయ్య, బి.కురుమయ్య, సాయిలీల, బీసన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

## 23న పండుగ సాయన్న జయంతి

**- జయంతిలో అందరూ పాల్గొనాలి : సాయన్న సేవా సమాజం నాయకుల పిలుపు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్20, ప్రభాతవార్త:** ఈనెల 23న నిర్వహించనున్న పండుగ సాయన్న జయంతిలో అన్ని సామాజిక వర్గాల నాయకులు పాల్గొనాలని పాలమూరు పండుగ సాయన్న సేవా సమాజం నాయకులు పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఏటా పండుగ సాయన్న వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాయన్న విగ్రహావిష్కరణ ఉంటుందని వెల్లడించారు. పార్టీలకు అతీతంగా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ప్రభుత్వమే జయంతిని అధికారికంగా నిర్వహించాలని, మినీ ట్యాంక్‌బండ్‌పై 132 అడుగుల పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**● నెలాఖరుకు మైనార్టీల కమిటీలు పూర్తి చేయాలి ● టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సోహైల్, డీసీసీ అధ్యక్షుడు జిఎంఆర్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్20, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గతంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సోహైల్, డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా మైనార్టీ నాయకులు విస్తృతంగా పర్యటించి మండల, గ్రామ స్థాయిలో కమిటీలు వేయాలని, నెలాఖరు వరకు కమిటీల నియామకం ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కి మైనార్టీలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీల అభ్యున్నతికి కృషి జరిగిందని, ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచిందన్నారు. కమిటీల ఏర్పాటు ప్రక్రియ త్వరితగతిన ఏర్పాటు చేయాలని, ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి

వారానికి మూడు రోజులు కేటాయించి, ప్రజల్లో ఉండాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అక్తర్, దేవరకద్ర నియోజవర్గ అధ్యక్షుడు అహ్మద్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, టౌన్ మైనార్టీ అధ్యక్షుడు అజ్మత్ అలీ పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ విద్య

**◆ వనపర్తిని విద్యాపర్తిగా నిలిపిన మంత్రి నిరంజన్‌రెడ్డికి కృతజ్ఞతలు : మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్ ◆ ఘనంగా విద్యా దినోత్సవం**

**వనపర్తి టౌన్, జూన్20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం మైనార్టీ గురుకుల పాఠశాల 9వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ పాల్గొని తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యకు గతంలో ఎన్నడు లేని విధంగా పెద్దపీట వేశారని వేలాది గురుకుల పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించి నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా పౌష్టికాహారం లోపం లేకుండా మంచి ఆహారాన్ని అందించడంతో పాటు మా బడి కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టి పాఠశాలల్లోని మౌలిక వసతులు అన్నింటిని పూర్తి చేసుకున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అని కొనియాడారు. వనపర్తికి విద్యాపర్తిగా పేరు తెచ్చిన మంత్రి నిరంజన్‌రెడ్డినివనపర్తి ప్రజలు కీర్తిస్తున్నారని మెడికల్ కళాశాల ఇంజనీరింగ్ కళాశాల నర్సింగ్ కళాశాల, మత్స్య కళాశాల వ్యవసాయ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలో కేజీ



విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

టు పీజీ విద్యను వనపర్తిలో కలిపిన ఘనత మంత్రి నిరంజన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వంఅందించిన ప్లేట్లు పుస్తకాలు, బెడ్ షీట్స్ కాస్మోటిక్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, అధ్యాపక బృందం కౌన్సిలర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసిన ఎస్ఐ



వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, జూన్ 20 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కొట్ర చౌరస్తా వద్ద పోలీస్ చెక్‌పోస్టును ఎస్ఐ శ్రీనివాస్ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న ఆవు దూడలపై నిఘా ఉంటుందని, అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. నిరంతరం పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు.

## మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుదాం!

**వెల్దండ, జూన్20 ప్రభాతవార్త:** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం మని హెచ్‌పీ పెట్రో బంక్ నిర్వాహకులు రామోజు శ్వేత అన్నారు. హరిత హారంలో భాగంగా కొట్ర గేటు సమీపంలో హెచ్‌పీ పెట్రో బంక్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి ప్రక్కన ఇరువైపుల మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని, మొక్కలు నాటడం వల్ల సకాలంలో వర్షాలు కురియడంతో పాటుమానవ మనుగడకు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సంతోష్, సతీష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

## పోచమ్మ దేవాలయాభివృద్ధికి సిమెంట్ బస్తాల విరాళం



**వెల్దండ, జూన్ 20 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామంలో ఎస్సీ కులస్తులు నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి జీయాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ రూ.50వేలు విలువ చేసే సిమెంట్ బస్తాలను ప్రకటించడంతో మంగళవారం యువసేన నాయకులు అందించారు. కార్యక్రమంలో నరేష్‌యాదవ్, వెంకటేష్, తానేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## గిరిజనులకు గిరిజనబంధు అందించాలి



**వెల్దండ, జూన్ 20 ప్రభాతవార్త:** లంబాడీ హక్కుల పోరాట సమితి గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్రకార్యనిర్వాహక అధ్యక్షులుబాణావత్ శంకర్ ఆధ్వర్యంలో బయలుదేరుతున్న గిరిజన సంఘం నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోగిరిజనులకు గిరిజనబంధు అందించివారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, గిరిజన బంధు అందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై అరెస్ట్ చేసిన వారిని విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో గిరిజన నాయకులు నర్సింగ్‌నాయక్, రఘునాయక్, శ్రీనునాయక్, రాహుల్‌నాయక్, శివనాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**కోయిల్‌కొండ, జూన్ 20 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యారంగంలో కష్టపడకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపిపి శశికళ భీంరెడ్డి సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన కోయిల్‌కొండలో మంగళవారం విద్యా దినోత్సవం జరుపుకున్నారు. జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ క్లాసులను ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం నూటికి నూరు మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలని ఎంపిపి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల విద్యకోసం కోట్లాది నిధులు ఖర్చుపెట్టడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలకు చేరి కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఈ సందర్భంగా విద్యార్థులకు ఎంపిపి సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం పోషకాహార విలువలతో కూడుకున్న రాగిజావను పాఠశాలల్లో ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థుల బుక్కులు, దుస్తులు పంపిణీ చేశారు. అక్కడి నుండి ప్రాథమిక పాఠశాలలో కూడా విద్యార్థులకుదుస్తులు, బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, కోయిల్‌కొండ గ్రామ సర్పంచ్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బి.కృష్ణ, ఎంపిడిఓ జయరాములు, జడ్పీహెచ్‌ఎస్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటజీ, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శంకర్, పాఠశాల



విద్యార్థులకు బుక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీనియర్ ఉపాధ్యాయులు శంకరయ్య, ఎస్సీ హాస్టల్ వార్డెన్ సత్యనారాయణరెడ్డి, మండల టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు లక్కి లక్ష్మినారాయణగౌడ్, వార్డు సభ్యులు ఆంజనేయులు పాల్గొన్నారు.

## రంగ సముద్రం రిజర్వాయర్ నీటి లీకేజీని పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



**శ్రీరంగాపురం, జూన్20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మరమ్మతుల నుండి నీళ్ల లీకేజీ అవుతున్నందుకు మంగళవారం ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు రిజర్వాయర్ మరమ్మతులను పరిశీలించారు. జడ్పీటీసీ మాట్లాడుతూ... రంగసముద్రం రిజర్వాయర్ నుండి తాగడానికి 13 గ్రామాలకు సాగునీటికి ఉపయోగపడుతున్న నీరు వృధాగా పారుతున్నందున తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలంటూ అధికారులకు సూచించారు. కాల్వల్లో పెరిగిన జమ్మును తొలగించాలని, కాలువల్లో జమ్ము, మట్టి పేరుకుపోవడం వల్ల నీరు ముందుకు సాగడంలేదని అక్కడికి వచ్చినఅధికారులకు తెలిపారు. ఎస్ఈ సత్య శీలారెడ్డి మాట్లాడుతూ..త్వరలోనే సమస్యలను పరిష్కరించే దిశగా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ కిరణ్ కుమార్, ఎఈ దేవరాజు, కిషోర్, తహసీల్దార్ మురళి గౌడ్, నీరడిలు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మిపల్లిలో ఘనంగా విద్యా దినోత్సవం





**దేవరకద్ర, జూన్20 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామ పురవీధుల గుండా భారీ ఎత్తున భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 110 మందివిద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ప్రధానో పాధ్యా యుడు వెంకటేశ్వర్లు, గ్రామ ఉపసర్పంచ్ నాగేష్‌గౌడ్, ఎస్ఎంసి ఛైర్మన్ చిన్న కాశన్న, ఉన్నత పాఠశాలఛైర్మన్ ఉషన్న, ఉపాధ్యాయులుసల్మాచారి, అశ్విని చంద్రశేఖర్, బాసిద్, కల్పన, శంకర్, ఆస్రాఖాద్రి, మురళీధర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## కుమ్మరుల సంఘ భవనానికి భూమిపూజ

**మూసాపేట, జూన్ 20 ప్రభాతవార్త:** మూసాపేట మండలం వేముల గ్రామంలో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఐదులక్షల ప్రొసీడింగ్‌ను కుమ్మరుల సంఘ భవన నిర్మాణానికి మంగళవారం జడ్పీటిసి ఇంద్రయ్య సాగర్‌భూమిపూజ చేశారు.



కార్యక్రమంలో ఎంపిపి కళావతి కొండ య్య, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మి నరసింహయాదవ్, గ్రామ సర్పంచ్‌అరుణ రఘుపతిరెడ్డి, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షులు మూసాపేట మండల సంఘం అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, గ్రామ కమిటిఅధ్యక్షులు, కార్యవర్గం కుల బంధువులు, గ్రామపెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చదువు, సంస్కారం రెండు విద్యార్థులకు ఉండాలి

**- విద్య రావాలంటే ఏకాగ్రత ఎంతో అవసరం : ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి**

**వీపనగండ్ల, జూన్20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవంలో మంగళవారం నూతనంగా నిర్మించుకున్న ఎంఆర్సీ పాఠశాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ... విద్యలో మనం చాలా ముందున్నామని వీపనగండ్ల మండల కేంద్రాన్ని విద్యా మండలంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించాలని విద్యను ఏకాగ్రతతో చదవాలని, చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని అన్నారు. రాష్ట్ర దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కథాలప్ప, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, పాఠశాలప్రధానోపాధ్యాయులు నాగేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ వంగూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

నరసింహారెడ్డి, ఎంపీపీ కమలేశ్వర్ రావు, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## దొమ్మరి కుల సంఘాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలి

**తెలంగాణ దొమ్మరి కుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డి. వెంకటేష్**



మాట్లాడుతున్న తెలంగాణ దొమ్మరి కుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డి. వెంకటేష్

**మహ్మదాబాద్, జూన్ 20 ప్రభాతవార్త:** మండలంలోని నంచర్ల గ్రామంలో దొమ్మరి కులసంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డి. వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దొమ్మరి కులాన్ని అన్ని జిల్లాల్లో ఎస్సీ జాబితాలో ఉంది. కానీ మహ్మదాబాద్, కులకచ్చర్ల మండలాల్లో బిసి ఎ గ్రూపులో ఉంది వారి జీవన విధానం అడవి ప్రాంతంలోకి పోయి కట్టెలు తెచ్చుకుని చెక్క దువ్వెనలు, ఇరివెనలు తయారు చేసుకుని వాటిని ఊరూరా తిరిగి అమ్ముకుని జీవనాన్ని సాగించేవారు. దువ్వెనల తయారీ, పందుల పెంపకం వీరి కుటీర పరిశ్రమలు. మా కులం తెలంగాణ వచ్చి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ రెండు మండలాల్లో ఉన్న దొమ్మరి వారిని ఎస్సీ జాబితాలో ఇప్పటివరకు చేర్పించలేదు. మాకు ఎలాంటి ఉపాధి కల్పించలేదు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిలో ఉన్న 15 కులాలకు లక్ష రూపాయల రుణంలో భాగంగా మా కులంని కూడా చేర్పించలేదు తెలంగాణ రాష్ట్ర దొమ్మర కుల సంఘం ఉపాధ్యక్షులు డి. వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని పత్రికా ముఖంగా తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎస్సీ జాబితాలో ఉన్నారు. మేము నివసిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లాలో మహ్మదాబాద్ కులకచ్చర్ల మండలంలో ఉన్న దొమ్మర కులస్తులను బిసి ఎ గ్రూపులో ఉన్నది ఎన్నోసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి మాసమస్యను తెలియజేశామని ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు అంజయ్య, సెక్రెటరీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, కోశాధికారి శ్రీనివాసులు, సంఘ సభ్యులులక్ష్మణ్, సుంకన్న, పోశయ్య, మాసయ్య, ఆంజనేయ, పెంటయ్య, ముత్తయ్య, విజయ్, లక్ష్మణ్, అశోక్, శ్రీను, కాసిం పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాలలో విద్యా దినోత్సవం

**శ్రీరంగాపురం, జూన్20, ప్రభాతవార్త:** దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నాగసానిపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఉత్తమ సేవలుఅందించిన ఉపాధ్యాయుడు ప్రదీన్ కుమార్‌ను పాఠశాల తరపున ఘనంగా సనానమనించారు. విద్యార్థులకు రాగి జావా పంపిణీ కార్యక్రమం, ఉచిత దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజనేయులు నాయుడు మాట్లాడుతూ... విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం, ఉన్నత విద్య అందించాలనే దృఢ సంకలనపంతో నేడు కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం నుండి అందుతున్న ప్రోత్సాహకాలను అందుకుని క్రమశిక్షణతో బాగా చదువుతు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు నాగసానిపల్లి గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం దుస్తులను పాఠ్య పుస్తకాలను అందజేస్తుందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఏకరూప దుస్తులను ధరించి పాఠశాలకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గొర్రెలకాపరుల సంఘం డైరెక్టర్ రాజు యాదవ్, పంచాయతీ కార్యదర్శి జీవిత, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

## విజయవంతంగా కొనసాగుతున్న టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ సేవలు



సంబురాలు నిర్వహించుకుంటున్న టీఎస్ ఆర్టీసీ డీఎం, సర్వీస్

**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:** టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ 3 సంవత్సరాలు ముగించుకొని 4వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా కల్వకుర్తి బస్టాండ్‌లో డీఎం ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ కౌంటర్ వద్ద సెలబ్రేషన్ నిర్వహించుకున్నారు. డిపోమేనేజర్ శ్రీకాంత్ కేక్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో ఎగ్జిక్యూటివ్ శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ విజయవంతంగా సేవలను పూర్తి చేసుకొని 4 సంవత్సరంలో అడుగు పెడుతున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విధంగా టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్‌ను ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పాల ఇన్సెంటివ్ పెంచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీకి వినతి

**కల్వకుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:** ప్రభుత్వం విజయ డైరీ ద్వారా పాల లబ్ధిదారులకు రూ.4 ఇన్సెంటివ్ పెంచుతానని చెప్పి ఇప్పటి వరకు పెంచలేదని, ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి కృషి చేయాలని మంగళవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి పాడి రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాడి రైతులకు రూ.4ల ఇన్సెంటివ్‌ను త్వరలో పెంచుతుందని, అదే విధంగా ఉచితంగా దానాను కూడా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రంఅధ్యక్షులు ఆర్.శ్రీనివాసులు, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంతరెడ్డి, రైతులుశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం